సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



పశు బీమా.. పడకేసింది!

జిల్లాలో పశుబీమా పథకం అమలు కాకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో▶



అన్ని హామీలు నెరవేర్చాలి

ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 8లో▶



సభను విజయవంతం చేద్దాం

మాలల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. 8లో▶

చదువు సాగేదెలా..!

విద్యాశాఖలో ఇష్టారీతిన డిప్యుటేషన్లు

'చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు 356 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలుగు సబ్జెక్టు టీచర్ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా చౌదరిగూడకు వచ్చారు. ఇక్కడ ఆమె కనీసం నెల రోజులు కూడా పని చేయలేదు. ఈలోపే వనస్థలిపురం ప్రభుత్వ స్కూలుకు డిప్యుటేషన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. విషయం విద్యార్థులకు తెలిసి ఆర్డర్ రద్దు చేయాలని, తమ చదువుకు ఆటంకం కలిగించొద్దని రెండు రోజుల నుంచి ఆందోళనకు దిగుతున్నారు. విద్యార్థుల ఒత్తిడి మేరకు అధికారులు ఇప్పటి వరకు ఆమెను రిలీవ్ చేయకపోయినప్పటికీ ఆర్డర్ ఎలా ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది'.

★

'కడ్తాల్ మండలం రావిచేడు ప్రభుత్వ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 135 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. సోషల్ సబ్జెక్టు టీచర్ ఇటీవల డిప్యుటేషన్‌పై కర్మన్ఘాట్ జెడ్పీహెచ్ఎస్‌కు వెళ్లారు. నిజానికి ఆమె స్థానంలో మరో సబ్జెక్ట్ టీచర్‌ను నియమించిన తర్వాతే ఆమెను అక్కడి నుంచి రిలీవ్ చేయాల్సి ఉంది. అధికారులు ఇందుకు విరుద్ధంగా వ్యవహరించి, విద్యార్థులకు తీరని అన్యాయం చేశారు.'

- మారుమూల గ్రామాల్లో పని చేసేందుకు ఉపాధ్యాయుల నిరాసక్తత
- రాజకీయ పలుకుబడితో కోరుకున్న చోటుకు గుట్టుగా ఆర్డర్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవితవ్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో కేవలం తెలుగు, సోషల్ టీచర్లే కాదు.. నాలుగు వందల మందికి పైగా ఉపాధ్యాయులు ఇతర జిల్లాల నుంచి డిప్యుటేషన్లపై వచ్చి పని చేస్తున్నట్లు అంచనా. వీరిలో మెజార్టీ ఉపాధ్యాయులు పోస్టింగ్ ఆర్డర్‌కు భిన్నంగా పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక, రాజకీయ పలుకుబడితో కొంత మంది వచ్చి చేరితే.. ఆరోగ్య సమస్యలతో మరికొంత మంది వచ్చి చేరారు. ఎప్పటికప్పుడు డిప్యుటేషన్లు రద్దు చేసి, అడ్డదారుల్లో వచ్చిన అధ్యాపకులను వెనక్కి తిప్పి పంపాల్సిన జిల్లా విద్యాశాఖ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

సబ్జెక్టు టీచర్లు లేక.. ఉన్నవాళ్లు రాక

ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 700 మంది పదోన్నతులు పొందగా, మరో 3,500 మంది ఒకచోటు నుంచి మరో చోటుకి బదిలీ అయ్యారు. వీరు కాకుండా కొత్తగా మరో 379 మంది ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇచ్చింది. మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసేందుకు ఇష్టం లేని కొంతమంది ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కుతున్నారు. తమకున్న ఆర్థిక, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తమ నివాసానికి సమీపంలోని స్కూళ్లకు డిప్యుటేషన్ ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి మేరకు సబ్జెక్టు టీచర్లు లేక.. సకాలంలో పాఠ్యాంశాలు పూర్తి కాక వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కాలేకపోతున్నారు. ఫలితాల మెరుగుకు పాటుపడాల్సిన అధికారుల అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు.

ఎవరికివారు తప్పించుకుంటూ..

ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నిష్పత్తి, పాఠ్యాంశాల బోధనపై ఆరా తీయాల్సిన ప్రజాప్రతినిధులు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. డిప్యుటేషన్ల కారణంగా తీరని అన్యాయం జరుగుతోందని ఇప్పటికే ఒకవైపు నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆందోళనలు చేస్తుంటే.. విద్యాశాఖలోని ఉన్నతాధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ఆయా ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ ఆర్డర్లు తాము ఇవ్వ లేదని.. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచే జారీ అయినట్లు ప్రకటించడం విశేషం. ఈ వ్యవహారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు చెబుతుండడం కొసమెరుపు.

రోడ్డెక్కిన విద్యార్థులు

కొందుర్గు: ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్‌ను వెంటనే రద్దు చేయాలని గురువారం చౌదరిగూడ మండల కేంద్రంలో విద్యార్థులు రోడ్డెక్కారు. వారికి ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సంఘం షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు డిప్యుటేషన్ల పేరుతో ఇష్టానుసారంగా వెళ్లిపోతే విద్యాబోధన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. పేద విద్యార్థులు చదువును నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయురాలు డిప్యుటేషన్‌పై వెళ్లారని, మరో ఉపాధ్యాయురాలు ఆర్డర్ తెచ్చుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయాలని, లేదంటే విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నరేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చౌదరిగూడలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న జవహర్‌రెడ్డి

భూమాతను రక్షించుకుందాం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- ఏపీ మాజీ చీఫ్ సెక్రెటరీ కేఎస్ జవహర్‌రెడ్డి

కడ్తాల్: భూమాతను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ మాజీ చీఫ్ సెక్రెటరీ కేఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్- తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్' ఓరియంటేషన్ గురువారంతో ముగిసింది. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జవహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వనరులను ఎప్పటికప్పుడు కాపాడుకోవాలని, వృథాను అరికట్టాలని, భవిష్యత్తులో ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని సూచించారు. కాలుష్యం, పర్యావరణ సమస్యలతో గ్లోబల్ వార్మింగ్, వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులది కీలక పాత్ర అని, వారిని ఈ దిశగా కార్యోన్ముకులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ, ఆర్గానిక్, గో ఆధారిత పంచగవ్య సాగు పద్ధతులను పరిశీలించి, వాటిని ప్రోత్సహించాలన్నారు. పర్యావరణ రక్షణకు సీజీఆర్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ప్రముఖ పర్యావరణ వేత్త పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ ఉంటుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎస్. ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతలో శారీరక శ్రమ తగ్గిందని .. ఇది ఇలాగే కొనసాగితే మనుషుల ఆయుష్షు గణనీయంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను వ్యాయామం దిశగా ప్రోత్సహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వ్యాయామ ఉపాధ్యాయులకు జవహర్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సీజీఆర్ స్టేట్ కో ఆర్డినేటర్ యానాల వెంకట్‌రెడ్డి, సీజీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జేఎస్ఆర్ అన్నమయ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి



కొందుర్గులో పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ రంగస్వామి

కొందుర్గు: శాంతి భద్రతల పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి సూచించారు. గురువారం ఆయన కొందుర్గు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, న్యాయం జరిగేలా చూడాలన్నారు. వారికి స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని, స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ ఛత్రియ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. షాద్‌నగర్ పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. తరచూ రైలు గేటు వేస్తుండటంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని.. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని తెలిపారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి బైపాస్ మీదుగా వచ్చే వాహనదారులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పనులను తిరిగి ప్రారంభించి, పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గెజిటెడ్ ఉద్యోగులకు అండగా ఉంటాం

టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు రామారావు



ఆర్డీఓ వెంకటమాధవరావుతో గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న గెజిటెడ్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు అన్నారు. గెజిటెడ్ అధికారుల సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం షాద్‌నగర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఆర్డీఓ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, సబ్‌ట్రెజరీ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలను సందర్శించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న గెజిటెడ్ ఉద్యోగులను కలిశారు. మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను మున్సిపల్ కమిషనర్ వెంకన్న దృష్టికి తీసకువచ్చారు. అనంతరం డాక్టర్ రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న గెజిటెడ్ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కష్టాల్లో వారికి అండగా ఉండటంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనేష్‌కుమార్‌నోరి, వెంకటేశ్, వెంకట్, అలివేలుమంగ, బాలరాజుగౌడ్, అనిత, సైదమ్మ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

వీటిని అన్ని లావాదేవీలకు ఉపయోగించొచ్చు

సుల్తాన్‌బజార్: పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవి. వీటిని రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని ఏపీ, తెలంగాణ, కర్ణాటక సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ సూచించారు. గురువారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ప్రజలకు, వినియోగదారులకు రూ.10 నాణేలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు రూ.10 నాణేల వాడకంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఈ నాణేలు చెల్లుబాటు అవుతున్నాయన్నారు. పది రూపాయల నాణేలు అన్ని చోట్లా తీసుకోవచ్చు.. అనే పోస్టర్లను రద్దీ ప్రాంతాల్లో, ప్రజా రవాణా ప్రాంతాల్లో ప్రజల అవగాహన కోసం అందుబాటులో ఉంచామని తెలిపారు. రూ.10 నాణేల వినియోగంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. రూ.10 కరెన్సీ నోట్లు త్వరగా చిరిగిపోవడం, వాటి ముద్రణ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో నాణేలను రిజర్వ్ బ్యాంక్ తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు రూ.10 నాణేల వాడకాన్ని ఉపయోగించాలన్నారు.



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

చదువుతోపాటు క్రీడలు ప్రధానం

జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు

కడ్తాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఫార్చ్యున్ బటర్ ఫ్లై సిటీ సెకండరీ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ జోనల్ లెవల్ అండర్-14, అండర్-17 కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంతో పాటు క్రీడల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఉన్నత చదువులు చదివేందుకు క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందని గుర్తు చేశారు.

పోటీల్లో విజేతలు..

అండర్ 14- బాలికల విభాగంలో ఇబ్రహీంపట్నం జోన్ ప్రథమ స్థానం సాధించగా, రాజేంద్రనగర్ జోన్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-14 బాలుర విభాగంలో ఇబ్రహీంపట్నం జోన్ ప్రథమ స్థానంలో నిలవగా, రాజేంద్రనగర్ జోన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్ -17 బాలికల విభాగంలో శంకర్‌పల్లి జోన్ ప్రథమ స్థానంలో నిలవగా, ఇబ్రహీం పట్నం జోన్ ద్వితీయ స్థానంలో నిలచింది. అండర్-17 బాలుర విభాగంలో సరూర్ నగర్ జోన్ ప్రథమ స్థానంలో నిలవగా షాద్‌నగర్ జోన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు షీల్డ్‌లతో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, సీఐ శివప్రసాద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎల్ఎన్‌రెడ్డి, ఎఫ్‌బీసీ పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్‌నాంపల్లి, జోనల్ కార్యదర్శి భీముడు, హెచ్ఎంలు జంగయ్య, అరుణ పాల్గొన్నారు.

మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పల్లెలను మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి ఎంపీడీఓలు నాంది పలకాలని కలెక్టర్ శశాంక సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం మండల అభివృద్ధి అధికారులతో వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, కమ్యూనిటీ శానిటరీ సముదాయాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, గ్రేవాటర్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత మరుగుదొడ్లపై అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు మండలంలో రెసిడెన్షియల్ స్కూల్, టూరిస్టు ప్రాంతాలు, బస్టాండ్లు, దేవాలయాల దగ్గర, ఆస్పత్రి ఆవరణ, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో జనసంద్రం ఎక్కువగా ఉన్న చోటును ఎంచుకోవాలన్నారు. గ్రే వాటర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా అన్ని గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్త గ్రామాలన్నింటిలో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించాలని, సాధ్యమైన చోట ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గృహాల నుంచి పొడి చెత్త, తడి చెత్త వేరు చేయబడిన వ్యర్థాలను సేకరించేలా ప్రత్యేక చర్యలు చేపడుతూ సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇప్పటికే నాటిన అవెన్యూ, బ్లాక్ మొక్కలను కాపాడే దిశగా కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో 3 నుంచి 5 గ్రామాలను ఎంపిక చేసుకొని ప్రత్యేక శ్రద్ధతో మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్డీఓ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సీపీఓ సౌమ్య, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

వ్యర్థాల నుంచి కంపోస్టు తయారు చేయాలి



రావిర్యాలలో డీఆర్ఎస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న హేమలత తదితరులు

తుక్కుగూడ: వ్యర్థ పదార్థాల నుంచి కంపోస్టు ఎరువు తయారు చేయాలని సీడీఎంఏ అధికారి హేమలత సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల డీఆర్‌సీ సెంటర్‌ను గురువారం ఆమె సందర్శించారు. చెత్త వేసే ప్రదేశం, కంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీ బండ్లకు చెత్తను ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ గుణాకర్, సిబ్బంది అశోక్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రం జారీలో జాప్యం

- బాధితుడి ఆత్మహత్యాయత్నం
- పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలింపు

యాచారం: 'మేడం ఇల్లు కట్టినందుకు అప్పులయ్యాయి.. ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తే ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకుని బ్యాంకులో రుణం తెచ్చుకుంటా.. మీరు ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోతే చావే శరణ్యం' అంటూ ఓ వ్యక్తి పంచాయతీ కార్యదర్శిని ప్రాధేయపడ్డాడు. ఆరు నెలలుగా సదరు కార్యదర్శి స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై పంచాయతీ కార్యాలయం ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలివీ.. యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ముక్కెరి మధుసూదన్ గ్రామంలో దాదాపు రూ.10 లక్షల వరకు అప్పు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. గ్రామంలోని పలువురికి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంతో వారంతా ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఆయా బ్యాంకుల్లో రికార్డులు తాకట్టుపెట్టి రుణాలు తెచ్చుకున్నారు. వారి మాదిరిగానే తనకూ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి ఆరు నెలల క్రితం సిబ్బందితో మధుసూదన్ ఇంటికెళ్లి ఇంటి స్థలం కొలతలు తీసుకుంది. అప్పటి నుంచి మధుసూదన్ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఎన్నిసార్లు అడిగినా రేపు, మాపు అంటూ దాటవేసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మధుసూదన్ గురువారం ఉదయం పురుగు మందు డబ్బాతో పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లాడు. తనకు ధ్రువీకరణ పత్రం ఇస్తారా.. ఇవ్వరా అంటూ ప్రశ్నించాడు. ఆమె నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. వెంటనే పంచాయతీ సిబ్బంది పురుగుల మందు డబ్బాను పక్కకు పడేసి యాచారం సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నను ఫోనులో సంప్రదించగా విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండడంతోనే జాప్యం జరిగిందని తెలిపారు.



ఆత్మహత్యాయత్నం చేసిన మధుసూదన్‌ను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్తున్న భార్య సునీత

యాదాద్రిలో గుండెపోటుతో భక్తుడు మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందాడు. ఆలయ, వైద్య సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ గ్రామానికి చెందిన దేశపాక పోశయ్య (55) గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చాడు. సాయంత్రం 4గంటల సమయంలో కొండపైకి దర్శనానికి వెళ్లారు. మాఢ వీధిలోకి వెళ్లగానే ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు ఆలయాధికారులు బ్యాటరీ వాహనంలో చికిత్స నిమిత్తం అతన్ని కొండ కింద ఉన్న యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ... వారు Kanugu Anthaiah S/o Kanugu Ramaiah, aged 53 years, Occ: Business R/o H.no. 22-105, Mudhiraj colony, Farooqnagar Mandal, R.R.Dist. వారికి ఇచ్చు LOAN ...

ఆస్తి వివరాలు: All that the part and parcel of house No.1-32, 1-62/1, 2-13/1, (old) 2-14, (new) over Plot No. 8 an extent 240 sq-yards, in sy.no.40/A, situated at Kothur Village & Mandal, R.R. Dist.

హద్దులు: East : Road, West: NH7 road, North: House of Rayapu Reddy, South: House of Shamantha

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ... వారు Nalamoni Buchaiah @ Bikshapathi S/o Jangaiah, aged 68 years, Occ: agriculture R/o Shadnagar, R.R. Dist. వారికి ఇచ్చు LOAN ...

ఆస్తి వివరాలు: All that the part and parcel of house No.1-8/B/6/A, over plot no. 142P, 141P, 140P, 139P, 138P, 137P, 136P/B in Sy.No. 196/P, total extent 493.46 sq.yards, situated at Farooqnagar Village & Mandal, R.R.Dist.

హద్దులు: East : plot no. 136P/B to 142P, West: plot no. 143 to 149P, North: Land of N.Shankar, South: Plot no. 136P/A

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ ఎమ్మెల్యే సబితారెడ్డి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక తోడ్పాటు ఇచ్చేందుకు కల్యాణలక్ష్మి తీసుకువచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్షతో పాటు తులం బంగారం అందజేయాలన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం సీడీఎఫ్, హెచ్ఎండీల నుంచి రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఈ నిధులను నిలిపి వేసిందన్నారు. మున్సిపాలిటీలో భూములను కబ్జా చేస్తే తాను సహించనన్నారు. అధికారులు అలాంటి భూములను గుర్తించి కాపాడాలన్నారు. సర్దార్‌నగర్ గ్రామంలో శ్మశాన వాటికలో ప్రతి ఒక్కరిని దహనం చేసే అవకాశం కల్పించాలన్నారు. ఎవరైనా అడ్డుకుంటే రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. అంతకు ముందు రావిర్యాల చెరువు కట్టను పరిశీలించారు. సుందరీకరణ కోసం హెచ్ఎండీఏ నుంచి మంజూరైన నిధులతో రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలతరాజుగౌడ్, తహసీల్దార్ సైదులు, కమిషనర్ బి.వెంకట్రామ్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, రాజు, విలాస్, భావన, లావణ్య, రవినాయక్, సుమన్, బీఆర్ఎస్ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను కాపాడుకుందాం

రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

మొయినాబాద్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మత్స్యకార చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మత్స్యకారులు చైర్మన్ సాయికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మెట్టు బాలయ్య చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడని పేర్కొంటూ, వారి కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని కులాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. మృతి చెందిన బాలయ్య కుటుంబానికి మత్స్యకార కార్పొరేషన్ ద్వారా సహాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ్‌నగర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు పట్నం రాంరెడ్డి, నాయకులు యాదగిరి, విజయ్‌కుమార్‌రెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పశు బీమా.. పడకేసింది!

ఆరేళ్లుగా నిలిచిన పథకం
- ఏటా మృతి చెందుతున్న పశువులు
- నష్టపోతున్న పోషకులు
- పట్టించుకోని అధికారులు



తిమ్మారెడ్డిగూడలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన పాడి పశువు (ఫైల్)



మన్‌సూర్లలో పిడుగుపాటుతో పశువులు మృతి

షాబాద్: పశుబీమా అమలు కాకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించే వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమలను కొనసాగిస్తే ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. ప్రభుత్వం చేయూతనందిస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఆరేళ్లుగా పశుబీమా పథకం నిలిపివేయడంతో ఇక్కట్లు పడుతున్నారు. పాడి పశువులు అనారోగ్యం, ఇతర కారణాలతో మృత్యువాత పడుతుండడంతో పోషకులు నష్టపోతున్నారు.

ఆరేళ్లుగా లేని బీమా

పశుబీమా పథకాన్ని 2017-18 వరకు గత ప్రభుత్వం అమలు చేసింది. ఆరేళ్లుగా ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా చనిపోతున్నాయి. మేలుజాతి పాడి పశువులకు రూ.లక్షలో డిమాండ్ ఉంది. అనివార్య కారణాలతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. గతంలో బీమా కోసం యజమాని కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం జమ చేసేది. ఏదైనా ప్రమాదంలో జీవాలు చనిపోతే ఆయా సంస్థల నుంచి గతంలో వాటి రకాన్ని బట్టి రూ.50వేల వరకు పరిహారం అందేది. దీంతో పశువులు మృత్యువాత పడిన వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకుని భరోసాగా ఉండేవారు. పథకం నిలిచిపోవడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఏటా జీవాల మృతి

జిల్లా వ్యాప్తంగా మొత్తం 7.50 లక్షలకు పైచిలుకు పశువులున్నాయి. ఏటా వందల కొద్ది పశువులు అనారోగ్య, పిడుగులు పడి, రోడ్డు, రైలు ప్రమాదాల్లో మృతి చెందుతున్నాయి. పలుమార్లు లంపీస్కిన్ తదితర వ్యాధులు సోకి ఆవులు, ఎద్దులు మృత్యువాత పడుతున్నాయి. గత ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకంలో పంపిణీ చేసిన గొర్రెలకు మాత్రమే బీమా వర్తింపజేసింది. ప్రస్తుతం గొర్రెలు, ఆవులు, ఎద్దులు, గేదెలకు బీమా సదుపాయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయించి బీమా చేయించాలంటే సుమారు రూ.50 వేలు ఉన్నా పశువుకు రూ.4వేలు ఖర్చవుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం పశుబీమా పథకాన్ని అమలు చేసి 50 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.

పథకాన్ని పునరుద్ధరించాలి



జిల్లాలో వందల కొద్ది జీవాలకు బీమా చేయించడం కష్టమవుతుంది. బీమా కోసం ప్రైవేటు కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చవుతుంది. అందుకే వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం పశుబీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలి. రైతుల వాటా కలుపుకొని ప్రీమియం చెల్లించాలి.

– శ్యామ నారాయణ, కుర్మ సంఘం అధ్యక్షుడు, షాబాద్

అధికారులకు నివేదించాం



రైతుల వద్ద ఉన్న పశువులకు బీమా సదుపాయం కల్పించలేదు. ప్రైవేటుగా బీమా చేసుకుంటే నష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుంది. గతంలో రైతులు కొంత చెల్లిస్తే ప్రభుత్వం కొంత మొత్తం చెల్లించి బీమా కల్పించేది. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి, రేగడిదోస్వాడ

సభను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు తదితరులు

మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

షాబాద్: మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేద్దామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చర్లగూడలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు గడప గడపకూ తిరుగుతూ ఈనెల 27వ తేదీన జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాలలంతా ఏకతాటిపై నిలిచి తమ ఆత్మగౌరవాన్ని చాటిచెప్పే విధంగా పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. మండలం నుంచి మాలలు భారీ సంఖ్యలో నాగర్‌కర్నూల్ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు సరైంది కాదన్నారు. వర్గీకరణ చట్టం అమలు పరచాలంటే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అన్ని ఆమోదాలు పొందినప్పుడే సాధ్యపడుతుందన్నారు. దేశ వ్యాప్తంగా తీర్పును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణకు అత్యుత్సాహం చూపిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ఎల్లయ్య, శ్రీనివాస్, నర్సింహులు, రాజు, సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు వెంకటేశ్, కృష్ణ, ప్రవీణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం 4వ రోజు కొనసాగుతున్న గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల విద్యాజ్యోతి, అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ కళాశాలల్లో కొనసాగుతున్న కేంద్రాలను ఆయన పరిశీలించి అభ్యర్థులతో మాట్లాడారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కడైనా తలెత్తుతున్నాయా అని తెలుసుకున్నారు. ప్రభుత్వం పరంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అభ్యర్థులు పరీక్షలు సజావుగా రాసేందుకు తమవంతు కృషిగా చేస్తున్నట్లు వివరించారు. క్రైమ్ డీఐ రమేశ్ మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

అనుమానాస్పదంగా మేకలు, కోళ్లు మృతి



మేకలు, కోళ్ల కళేబరాలు

మీర్‌పేట: అనుమానాస్పద స్థితిలో కోళ్లు, మేకలు మృతి చెందాయని ఓ నిర్వాహకుడు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. లెనిన్‌నగర్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన వల్లెపు వెంకటేష్ బడంగ్‌పేట చైతన్యనగర్‌లో పది నెలలుగా స్థలాన్ని లీజుకు తీసుకుని కాంపౌండ్ వాల్ నిర్మించి అన్న వల్లెపు నర్సింహతో కలిసి అందులో మేకలు, కోళ్లను పెంచుతున్నాడు. బుధవారం రాత్రి ఫంక్షన్ ఉండడంతో గేటుకు తాళం వేసి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి కోళ్లు, మేకలు చనిపోయి ఉన్నాయి. 12 మేకలు, 20 నాటు కోళ్ల మెడ భాగంలో ఎవరో కావాలనే కత్తితో కోసి చంపారని, మరో మూడు మేకలు చనిపోయే స్థితిలో ఉండగా, 30 కోళ్లు కనిపించడం లేదని నిర్వాహకుడు నర్సింహ తెలిపాడు. దాదాపు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని పశు సంవర్థక శాఖ అధికారులతో కలిసి పరిశీలించగా, కుక్కలు దాడి చేయడం వల్లే మేకలు, కోళ్లు మృతి చెందాయని నిర్ధారించినట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు వివరించారు.

లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ పేరుతో యువతిని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి యం.వాణి తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి కోర్టు ఏపీపీ మంజులా దేవి తెలిపిన మేరకు...మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామానికి చెందిన కాశీ విశ్వనాథ్ (29) అదే గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండేళ్ల అనంతరం పెళ్లికి నిరాకరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు గురువారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.3 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

సెకండ్ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేయాలి

శంషాబాద్: రెండవ ఏఎన్ఎంలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ హోటల్‌లో జరిగిన రెండవ ఏఎన్ఎం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా వైద్య రంగంలో విలువైన సేవలందిస్తున్న రెండవ ఏఎన్ఎంల విషయంలో ప్రభుత్వాల వైఖరి మారడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఏళ్లుగా సర్వీసులో ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేకపోవడంతోపాటు సరైన వేతనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండవ ఏఎన్ఎం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏఐటీయూసీ నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ... సెకండ్ ఏఎన్ఎంల శ్రమలను దోచుకోవడం ప్రభుత్వాలకు అలవాటుగా మారిందన్నారు. నవంబర్ 17న శంషాబాద్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కారు ఢీకొని ఇద్దరి దుర్మరణం

మహేశ్వరం: టీవీఎస్ ఎక్సెల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సీఐ వెంకటేశ్వర్లు, స్థానికుల వివరాల ప్రకారం.. హబీబీబుల్లాగూడ(పులిమక్త)కు చెందిన పొంగువాల చాకలి లక్ష్మయ్య(61), అమీర్‌పేట్‌కు చెందిన మాదరమోని చంద్రయ్య(60).. అమీర్‌పేట్ సమీపంలో జరిగిన ఓ విందుకు హాజరై టీవీఎస్ వాహనంపై అమీర్‌పేట్ వెళ్తుండగా, మన్నాన్‌పల్లి చౌరస్తా నుంచి అమీర్‌పేట్ వైపు వెళ్తున్న కారు.. వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందగా, వెనక కూర్చున్న చంద్రయ్య ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు.

పోలీసులపై దాడి.. ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్: పీకలదాకా మద్యం సేవించి అర్ధరాత్రి రోడ్లపై ఆవారాగా తిరుగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్న ముగ్గురు యువకులను 'రోడ్లపై ఎందుకు ఉన్నారు..ఇంట్లోకి వెళ్లండని' హితవు పలికినందుకు పోలీసులను చితకబాదిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..శ్రీనగర్‌కాలనీ గణపతి కాంప్లెక్స్ సమీపంలోని శాలివాహననగర్ రోడ్డులో బుధవారం అర్ధరాత్రి 2.30 గంటల ప్రాంతంలో రాజు, శేఖర్ అనే బ్లూ కోల్ట్స్ పోలీసులు విధి నిర్వహణలో తిరుగుతున్నారు. అదే సమయంలో శాలివాహననగర్‌లో నివసించే కార్తీక్, అశోక్ అనే ఇద్దరు అన్నదమ్ములతో పాటు మోహన్ అనే వీరి స్నేహితుడు ముగ్గురూ మద్యం మత్తులో ఊగిపోతూ రోడ్లపై తిరుగుతున్నారు. ఇంట్లోకి వెళ్లండి..ఇంత రాత్రివేళ రోడ్లపై ఏమి చేస్తున్నారంటూ పోలీసులు వారికి చెప్పారు. వెళతాంలే..మీరు మాకు చెప్పాల్సిన అవసరం లేదు..అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. అయినా సరే ఎంతో విజ్ఞతతో పోలీసులు వారి ముగ్గురిని ఇళ్లకు పంపించేందుకు ప్రయత్నిస్తుండగా ముగ్గురూ కలిసి పోలీసులపై దాడి చేసి చితకబాదారు. అరగంట పాటు రోడ్డుపై న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందులో అశోక్, మోహన్‌లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తుండగా, కార్తీక్ డీజే ప్లేయర్‌గా పనిచేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'హాక్ 2.0'కు కసరత్తు!

- వచ్చే నెల 6న నిర్వహించాలని నిర్ణయం
- ముఖ్య అతిథిగా ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచడానికి, ప్రతి ఒక్కరినీ సైబర్ వారియర్స్‌గా తీర్చిదిద్దడానికి ఉద్దేశించిన సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్స్‌ను మరోసారి నిర్వహించాలని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ నిర్ణయించారు. గత ఏడాది ఆయన నగర పోలీసు కమిషనర్‌గా ఉండగా తొలి హాక్-2023 సమ్మిట్ నిర్వహించారు. తాజాగా మరోసారి హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ నాలెడ్జ్ సమ్మిట్-2024కు (హాక్ 2.0) సన్నాహాలు చేస్తున్నారు. నగర పోలీసు విభాగం, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) సంయుక్తంగా నిర్వహించే ఈ సమ్మిట్ వచ్చే నెల 6న నగరంలోని ది పార్క్ హోటల్‌లో జరుగనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ప్రతి ఏడాదీ ఇలాంటి సమ్మిట్స్ నిర్వహించాలని, సైబర్‌తో పాటు ట్రాఫిక్, నార్కోటిక్స్, ఉమెన్ సేఫ్టీ విభాగాలకు వీటిని విస్తరించాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గతంలోనే నిర్ణయించారు. యువత... ప్రధానంగా విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న చేపట్టబోయే సైబర్ సమ్మిట్‌లో కొన్ని విద్యా సంస్థలకు చెందిన సైబర్ స్క్వాడ్స్‌ను ఆవిష్కరించే అవకాశం ఉంది. వీళ్లు వారి పాఠశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారు. ఎప్పటికప్పుడు కొత్త ముప్పులు పుట్టుకువస్తున్న ఈ తరుణంలో ప్రతి ఒక్కరికీ సైబర్ సెక్యూరిటీ అన్నది అత్యంత కీలకాంశంగా మారింది. దీనికోసమే సిటీ పోలీసులు, హెచ్‌సీఎస్సీ కలిసి పని చేస్తూ ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నాయి.

కలప పట్టివేత

ధారూరు: అక్రమంగా తరలిస్తున్న కలప వాహనాన్ని ధారూరు పోలీసులు పట్టి వేశారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక గుల్బర్గా జిల్లా చించొల్లి తాలుకాలోని కిష్టాపూర్ నుంచి వస్తున్న డీసీఎంను గురువారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. రాత్రి వేళ బ్లూకోర్టు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది శంకర్, సుదర్శన్ ధారూరు ఎక్స్ రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్తుండగా డీసీఎంను నిలిపివేశారు. ఎక్కడి నుంచి వస్తున్నావు అని డ్రైవర్ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా మౌనం వహించడంతో.. అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీసీఎం పైన కప్పిన పాలిథిన్ కవర్ తీసి పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేని కలప గుర్తించారు. కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

2BHK Flat for Sale 1000 Sft North Face Cupboards, Lift, CC Cameras Available Dilsukhnagar Ph : 9885202404 [H-10869]

PLOT FOR SALE

VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ., బందరు రోడ్డు, నున్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, AP CRDA ప్లాట్స్ చ॥గ॥ 1,900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర: 78934 21245 [B-109]

Services

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్:9100329739 [800515]

BUSINESS OFFER

ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/బిజినెస్ ఫైనాన్స్ సలహాలకై సంప్ర : 9100729447 [HA-3881]

మీ బంగారం బ్యాంకుల్లో గానీ మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న. మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9398709618 [H-796641]

Good opportunity monthly income,invites good investors for group of educational institutions hyd. 8639364374 [HA-98820]

PERSONAL CARE

CHANGE OF NAME

I,PANJALA BALRAJ GOUD, S/o. LATE. KRISTAIAH, R/o. H.No. 3-18-118, Lalamiya Basti, RTC Colony, Trimulgherry-500015, Hyderabad, Telangana, that my name was mentioned as a BALKA-RAJ P in my Son's Board of Secondary Education Certificate, which is also correct name. that my Two names are same person [SCA24000480]

LOST

I, RAMESH REDDY JAKKNA, S/o. CHANDRA REDDY JAKKNA, R/O, 247-249, # 101, Nizampet-90, I lost my passport bearing No: A3603424, if any body found Call: 9391383109 [SCA24000358]

I, GAJAPAKA POORNIMA D/O ILLAIAH LOST MY Original Passport No. K8554734, at Narayanguda Xerox shop,If Any one Found PLZ Call:90599 50032 [H-796648]

OLD AGE HOME

వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్: 7981467036, 9391039990, 8074327715 [H-783357]

TOURS & TRAVELS

SVS టూర్స్ శ్రీలంక, కాశీ, నేపాల్, భూటాన్, గుజరాత్, ఉజ్జయిని, ఒరిస్సా, అస్సాం చార్‌దామ్, వైష్ణవీ TN 9030123243, 7386579123 [SCA24000456]

Wanted

అబ్దుల్లాపూర్‌మెట్, హట్టిగూడ, తట్టి అన్నారం, ప్రతాపసింగారం, రాంపల్లి, జవహర్ నగర్, అహ్మద్ గూడ, మురహరిపల్లి, తూంకుంట ఏరియాలలో సెక్యూరిటీ గార్డులు 8 గంటలు జీ: 13500/- మరియు 12 గంటలు జీ: 16500/-. డ్యూటీ చేయుటకు కావలెను. సంప్ర : 9246355129 [H-804879]

హోటల్‌లో పనిచేయుటకు అనుభవం గల ఆడ వంట మనుషులు కావలెను. రోజుకు 700 రూపాయలు వరకు జీతం+వసతి+భోజనం, కే.పి.హెచ్.బి. కాలనీ, కూకట్‌పల్లి. 9247478121 [HA-33171]

దుండిగల్, కోకాపేట్, నానక్‌రామ్ గూడలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం రూమ్ కలదు. Ph: 8328622868 [H-783406]

రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ప్రముఖ కంపెనీలో మార్కెటింగ్‌కు M/F కావలెను. సాలరీ+ కమీషన్, ఫ్రీ ట్రైనింగ్ (Freshers only) 9032882395 [HA-10870]

అర్జెంటుగా అకౌంటెంట్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు డ్రైవర్స్ కావలెను. సంప్రదించండి. ఫోన్: 9392663777, 9246663777 [SCA2400438]

ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185488]

శ్రీలక్ష్మీ హోం కేర్: హైదరాబాద్ నందు వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/ వంట పనికి స్త్రీ/ పురుషులు కావలెను. జీతం: 18000/- రూం+ మీల్స్ ఫ్రీ ✆ 93471 48051 [G-2191]

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 9160900024 [SCA24000401]

అన్నపూర్ణ హోమ్‌కేర్‌లో కేర్‌టేకర్స్, పేషెంట్ కేర్, పెద్దవారికి సేవ చేయడానికి ఆయాలు, ఇంటిపని వంటపనికి స్త్రీ/పురుషులు కావలెను. జీతం : 16000 to 30000 రూమ్ + మీల్స్ ఫ్రీ. 9390427694 [HA-797]

JOB VACANCY: Work from Home, J.K.Enterprises, Age: 18 to 45 yrs, 10th to Any Degree, Sal: 18000/- to 25000/- ✆ 9908569609. [T-789016]

Wanted Experience Sales Person & Helpers For Handloom Saree Store Near to Secretariate. Salary 15-18K, Ph: 9989698981 [HA-805]

FACULTY TEACHERS

Alpha Model High school, karmanghat, LB Nagar Wanted English Faculty Ist- Xth class full time 9052221375,9292920070 [H-782720]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు | జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453